క్లుప్తంగా

రైల్వే వినియోగదారుల కమిటీ మెంబర్‌గా శిద్దా సూర్యకుమారి



శిద్దా సూర్యకుమారి

ఒంగోలు మెట్రో: ప్రముఖ గ్రానైట్ పారిశ్రామికవేత్త, రైజ్ కృష్ణసాయి ఇంజినీరింగ్ కళాశాల నిర్వాహకుడు శిద్దా వెంకటేశ్వరరావు సతీమణి శిద్దా సూర్యకుమారిని రైల్వే వినియోగదారుల కమిటీ మెంబర్‌గా నియమించారు. ఆ మేరకు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ వారి నుంచి నియామకపత్రం అందినట్లు శిద్దా సూర్యకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే వినియోగదారులకు సేవలు అందించడానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ బాధ్యతలు మూడు సంవత్సరాలు

'జూపిటర్' విద్యార్థులకు బహుమతులు



బహుమతులు గెలుపొందిన జూపిటర్ విద్యార్థులు

ఒంగోలు సిటీ: గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిర్‌లో జరిగిన ఈ–అభ్యాస్ 11వ వార్షికోత్సవంలో ఈ–అభ్యాస్ వారి అనుబంధ స్కూల్స్‌లో నిర్వహించిన పోటీల్లో జూపిటర్ విద్యార్థులు గెలుపొంది బహుమతులు అందుకున్నారు. ఈ బహుమతులను ఎమ్మెల్సీ, అపుస్మా చైర్మన్ ఎం.వి.రామచంద్రరెడ్డి, అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు తులసి విష్ణుప్రసాద్, డీఎస్పీ సరిత, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఐఐటీ ఇన్‌చార్జ్ ఇందిరా, దుర్గ, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో తీవ్ర ఇబ్బందులు



వెల్లంపల్లిలో ఈదురుగాలులకు నేలకూలిన చెట్టు

మద్దిపాడు: మండలంలోని మద్దిపాడు, వెల్లంపల్లి, గుండ్లాపల్లి, కొలచనకోట, తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో రెండు గంటల పాటు జనజీవనం స్తంభించింది. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఒక్కసారిగా ఈదురుగాలులు వీయడంతో ప్రజలంతా పక్కా భవనాల్లోకి పరుగులు తీశారు. బలంగా వీచిన గాలులకు వెల్లంపల్లిలో చెట్టు నేలకూలింది.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

సంతనూతలపాడు: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా వాసవీ క్లబ్, మహిళా క్లబ్ ఆధ్వర్యంలో సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద వారం రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. వేమూరి సుబ్బారాయుడు, లక్ష్మీకాంతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ వేమూరి వేంకట శేషారావు ఆర్థిక సహకారంతో 300 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాదరావు పాల్గొని ప్రారంభించగా, క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీప్రసాదరావు, అధ్యక్షుడు వేమూరి వేంకట శేషారావు, వాసవీ మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, కార్యదర్శులు వేమూరి ఆంజనేయులు, శిఖాకొల్లి జయశ్రీ,, గౌరవాధ్యక్షుడు పాదర్తి గిరి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే లక్ష్య సాధన

ఒంగోలు టౌన్: పట్టుదల, కృషి, కసి, క్రమశిక్షణ ఉంటేనే అనుకున్న లక్ష్యాలను సాధించడం సాధ్యమవుతుందని బహుజన ఉపాధ్యాయ సంఘ నాయకుడు జాలాది మోహన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువు, తెలివితేటలు ఉన్నప్పటికీ క్రమశిక్షణ లేకపోతే విద్యార్థులు నష్టపోతారన్నారు. నైతిక విలువలతో వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలని సూచించారు. పిల్లలు చదువులో ముందుండాలంటే ఆటపాటల్లో రాణించాలని, మంచి అలవాట్లు కలిగి ఉండాలని చెప్పారు. కథల ద్వారా సృజనాత్మకత పెరుగుతుందని, తద్వారా ఆత్మవిశ్వాసం పెరిగి జీవితంలోని సమస్యలను స్వయంగా పరిష్కరించుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. జిల్లా గ్రంథాలయ ఉపపాలకురాలు బొమ్మల కోటేశ్వరి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇమ్మానుయేలు, అనిల్‌బాబు, లక్ష్మి, దయామణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

సంతనూతలపాడు: స్థానిక అంబేడ్కర్‌నగర్ మొదటి లైన్లో ఇండియా పెంతెకోస్ట్ ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తును స్తుతిస్తూ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సంతనూతలపాడులో ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాస్టర్ బి.జనార్దన్‌రావు పర్యవేక్షించారు.

అధికారులు, పాలకుల తీరు మారదు..

ఒంగోలులో నీరు మారదు..!

- నగర ప్రజలకు తీవ్రస్థాయిలో నీటి కష్టాలు
- మురుగుమయంగా వస్తున్న రక్షిత మంచినీరు
- పైపులైన్లన్నీ లీకులమయం
- ప్రజలకు మురుగునీరే దిక్కయిన వైనం
- నగరపాలక సంస్థ అధికారుల పనితీరు అస్తవ్యస్తం
- ప్రజాప్రతినిధులకు సైతం పట్టని నగర ప్రజల ఆరోగ్యం
- అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులకు అక్రమ ఆదాయ మార్గాలే ప్రధానం



ఒంగోలు నగరంలోని సీతారాంపురంలో రంగు మారి దుర్వాసన వస్తూ సరఫరా అయిన మంచినీరు

ఒంగోలు సబర్బన్: నగరంలో మంచినీటి సరఫరా తీరు అస్తవ్యస్తంగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులకు అక్రమ ఆదాయ మార్గాలపై ఉన్న ఆసక్తి ప్రజల బాగోగులపై లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ప్రతిరోజూ ఏదో ఒక ఏరియాలో మంచినీరు మురుగుమయంగా వస్తోంది. పేరుకు సాగర్ నీరు.. వచ్చేదేమో మురుగునీరు.. ఇక, నగర ప్రజల ఆరోగ్యం ఏం కావాలంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకుల తీరును తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. ప్రజలకు మంచినీటి సరఫరా కోసం కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తున్నట్లు లెక్కలు చూపిస్తున్నారు. అయినా ప్రయోజనం మాత్రం శూన్యంగా ఉంది. మురుగునీటి సరఫరాతో నగర ప్రజలు అవస్థపడుతూనే ఉన్నారు. కలుషితమై వస్తున్న రక్షిత మంచినీరు తాగడానికి పనికిరాకపోవడంతో నగర ప్రజలు మినరల్స్ లేని బబుల్ వాటర్ తాగి లేనిపోని రోగాలు కొనితెచ్చుకుంటున్నారు. ప్రజల ఆరోగ్యం అధికారులు, పాలకులకు అసలు పట్టడం లేదంటూ నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు నగరపాలక సంస్థతో పాటు అన్ని మున్సిపాలిటీలకు పేరుకు పబ్లిక్ హెల్త్ విభాగం ప్రత్యేకంగా ఉంది. దాని వల్ల ఒంగోలు నగర ప్రజలకు ప్రయోజనం సున్నా అనే చెప్పాలి.

కనీసం స్నానానికి కూడా పనికిరాని విధంగా నీటి సరఫరా...

ఒంగోలు నగరంలో శనివారం సాయంత్రం సరఫరా చేసిన మంచినీరు మురుగునీటిని తలపిస్తోంది. స్థానిక సీతారాంపురంలో వచ్చిన నీరు రంగు చూస్తే తాగడానికి పనికొచ్చే సంగతి దేవుడెరుగు.. కనీసం స్నానానికి కూడా పనికిరావు. ఎన్నిసార్లు చెప్పినా ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులకు చీమకుట్టినట్లు కూడా ఉండటం లేదు. వీళ్లకు ఆదాయం, అక్రమార్జనకు పనికొచ్చే వనరులు మినహా ప్రజల ఆరోగ్యం విషయంలో కించిత్తు కూడా ఆలోచన లేదు. పగలు మాత్రమే మంచినీళ్లిస్తామని చెబుతున్న అధికారులు.. కొన్ని ప్రాంతాల్లో అర్ధరాత్రులు కూడా నీళ్లిచ్చి నగర ప్రజలను నానా అవస్థలపాలు చేస్తున్నారు. పైపులన్నీ లీకులమయంగా మారాయి. డ్రైనేజీలోని మురుగునీరు మంచినీటి పైపుల్లో కలిసి వస్తున్నాయి. ఒంగోలు నగరపాలక సంస్థ అధికారుల తీరు ఎలాగో మారదు.. మరి ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారు.. వారు కూడా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులకు అవినీతి అక్రమాల అన్వేషణ తప్ప ప్రజల ఆరోగ్యంపై కాస్తయినా శ్రద్ధ లేకపోవడంపై నగరవాసులు అసహ్యించుకుంటున్నారు.

దిశ సమావేశంలోనూ మురుగునీటిపైనే చర్చ...

ఇటీవల కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చైర్మన్‌గా, కలెక్టర్ వైస్ చైర్మన్‌గా అధికారులు, ప్రజాప్రతినిధులతో దిశ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో కూడా ఒంగోలు నగరంలో వస్తున్న మురుగునీటిపైనే ప్రజాప్రతినిధులు సమస్యపై లేవనెత్తారు. అమృత్ 2.ఓ పేరుతో పథకాలు అమలు చేస్తున్నామని పబ్లిక్ హెల్త్, ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు ప్రస్తావించగానే ప్రజాప్రతినిధులు లేచి నగరంలో మురుగునీరు వస్తుంటే ఏం చర్యలు తీసుకున్నారని నిలదీశారు. అలా రాకుండా చూస్తామని సమావేశంలో మాటిచ్చారు. అయినా నగర ప్రజలకు మురుగునీటి సమస్య తప్పడం లేదు. శనివారం సాయంత్రం వదిలిన రక్షిత మంచినీరు కూడా మురుగుమయంగా వచ్చాయి. ఒక్క సీతారాంపురంలోనే కాకుండా నగరంలోని అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రజలు తీవ్రస్థాయిలో నీటి సమస్యతో అవస్థపడుతున్నారు.

15, 20 డివిజన్లకు సరఫరా కాని మంచినీరు

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని 15వ డివిజన్‌లో అన్నవరప్పాడు, రాంనగర్ తదితర ప్రాంతాలతో పాటు, 20వ డివిజన్‌లోనూ మంచినీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులకు ఒకసారి మంచినీరు సరఫరా చేయాల్సి ఉండగా, 15వ డివిజన్‌లోని అన్నవరప్పాడులో ఆదివారం ఉదయం నీరివ్వాలి. భాగ్యనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం సరఫరా చేయాలి. కానీ, నీరు ఇవ్వకపోవడంతో ప్రజలు అవస్థపడ్డారు. అసలే వేసవికాలం కావడం తాగునీరు, వాడుక నీటి కోసం ఏం చేయాలో అర్థంగాక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అన్నవరప్పాడు ప్రాంతంలో భూగర్భ జలాలు తీవ్ర ఉప్పులుగా ఉంటాయి. మోటార్లే తుప్పు పడుతుంటాయి. ఈ ప్రాంతంలో ఏ ఇంట్లోనూ బోరు కూడా ఉండదు. దీంతో వాడుక నీటికి సైతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాంనగర్ 10వ లైన్, 11వ లైన్ ప్రాంతాల్లోనూ గత వారం రోజులుగా మంచినీరు సక్రమంగా సరఫరా కావడంలేదు. పైపులైన్‌లు లీకేజీ అంటూ రోజుల తరబడి కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది చెప్పుకొస్తున్నారు. పైపులైన్ లీకేజీ పేరుతో ఇష్టారీతిన రోడ్లు తవ్వి అనంతరం పూడ్చకపోవడంతో రాత్రివేళల్లో వాహనదారులు ఆ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

ముందస్తు సమాచారం లేకుండానే..

ప్రజలకు ముందస్తు సమాచారం లేకుండానే నీటి సరఫరా నిలిపివేస్తుండటంతో నీటి సమస్య మరింత తీవ్రమవుతోంది. ఆదివారం మంచినీరు వస్తుందని భావించి ఇంట్లో ఉన్న కొద్దిపాటి నీరు కూడా వాడుకున్న ప్రజలు.. తీరా, నీరు రాకపోవడంతో ముందస్తు సమాచారం ఇవ్వని నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది తీరును తీవ్రంగా తప్పుబట్టారు. సంబంధిత అధికారులు, సిబ్బందికి ఫోన్ చేస్తే స్విచాఫ్ వస్తోందని వాపోతున్నారు. కనీసం ముందుగా సమాచారం అందించినా.. ఉన్న కొద్దిపాటి నీటిని పొదుపుగా వాడుకునేవారిమని ప్రజలు చెబుతున్నారు. పైగా, నీరు ఎప్పుడు సరఫరా చేస్తారో కూడా సమాచారం అందించే నాథుడు లేకపోవడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాద వ్యతిరేక పోరాటం

ఒంగోలు టౌన్: జాతీయోద్యమంలో అమరులైన భగత్ సింగ్, ఉద్దం సింగ్ స్ఫూర్తితో మతోన్మాద, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని కొనసాగించాలని జనసాహితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం జలియన్ వాలాబాగ్ దినం సందర్భంగా భగత్‌సింగ్ అమరత్వం–సామ్రాజ్యవాద క్రూరత్వం పేరుతో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బహుళ జాతి కంపెనీల పెట్టుబడులు పెరిగే కొద్దీ సంపద కొద్దిమంది దగ్గరే పోగవుతుందని చెప్పారు. దాంతో దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు బ్రిటిష్ పాలకులు జలియన్ వాలాబాగ్‌లోనూ, భగత్ సింగ్, ఉద్దం సింగ్ తదితరుల పట్ల ప్రదర్శించిన క్రూరత్వం నేడు కొత్త రూపాల్లో భారత పాలకులచే అమలు చేయబడుతుందని చెప్పారు. శ్రామిక ప్రజా ఉద్యమం ద్వారా మాత్రమే సామ్రాజ్యవాద, మతోన్మాద సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు.

ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడు గురునాథశర్మ మాట్లాడుతూ అప్పులిచ్చే సాకుతో సామ్రాజ్యవాదులు పేద దేశాలపై కొత్త రకం యుద్ధం చేస్తున్నారని చెప్పారు. మతం, కులం పేరుతో పాలకులు పన్నుతున్న ఉచ్చులో పడకుండా ప్రజలు సంఘటితం కావాలని కోరారు. నాటి బ్రిటీష్ పాలకులు, నేటి భారత పాలకులు ఉద్దేశపూర్వకంగా భగత్‌సింగ్ చరిత్రను మరుగున పడేలా కుట్రలు చేశారని జనసాహితి నాయకుడు ఖాదర్ బాషా వివరించారు. ఉద్యమాలు బలపడితేనే దేశంలో సమూల మార్పులు సాధ్యమవుతాయన్నారు. హిందూ ముస్లింల మధ్య విభేదాలు రాజేయడం ద్వారా ఎక్కువ కాలం పరిపాలించేందుకు బ్రిటిష్ పాలకులు ప్రయత్నించారని, నేడు బీజేపీ కూడా అదేదారిలో పయనిస్తుందని చెప్పారు. ప్రజలు జాతీయోద్యమ నాయకుల ఆలోచనలను అర్థం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రసన్న అధ్యక్షత వహించగా, డీవీ శాంతికుమార్, సత్యనారాయణ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై రఘునాయకుడు



గరుడ వాహనంపై ఊరేగుతున్న రఘునాయకస్వామి

నాగులుప్పలపాడు: మండలంలోని చదలవాడ రఘునాయకస్వామి కళ్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మోహిని ఉత్సవం అనంతరం ఆలయ ఈవో అనిల్ పర్యవేక్షణలో స్వామివారికి అలంకరణ చేసి గరుడ వాహనంపై ఊరేగించారు. ఈ గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గరుడ వాహనం ఉభయదాతలుగా మద్దిరాలపాడు గ్రామానికి చెందిన చెరుకూరి రమేష్ వ్యవహరించి స్వామివారికి ఉభయం అందజేశారు. ఆదివారం సూర్యచంద్ర ప్రభోత్సవం అనంతరం రాత్రికి స్వామివారికి గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. గజవాహనానికి పెనుబోతు రంగారావు ఉభయదాతగా వ్యవహరించారు.

నేడు రఘునాయకుని కళ్యాణోత్సవం...

శ్రీరామనవమి వేడుకతో మొదలుపెట్టిన శ్రీ రఘునాయకస్వామి కళ్యాణోత్సవంలో భాగంగా ప్రధాన ఘట్టమైన స్వామివారి కళ్యాణోత్సవాన్ని సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అనీల్ తెలిపారు. అనంతరం 12 గంటలకు గ్రామోత్సవం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

గరుడ పక్షి రాకతో కళ్యాణం...

రఘునాయకస్వామి కళ్యాణోత్సవంలో ప్రధాన ఘట్టం అందరినీ భక్తిపారవశ్యంలో ముంచెత్తనుంది. గరుడ పక్షి రాకతోనే రఘునాయకుని కళ్యాణోత్సవం జరగనుంది. అనాదిగా వస్తున్న సంప్రదాయం, భక్తుల నమ్మకం, స్వామివారి కరుణ కటాక్షాలతో వేదికపై గరుడ పక్షి మూడు సార్లు ప్రదక్షిణలు చేసిన తర్వాతే స్వామివారి తలంబ్రాలు కార్యక్రమం పూర్తి చేస్తారు. ఈ గరుడ పక్షి రాక కోసం వేలాది మంది భక్తులు ఎదురుచూస్తారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండ హారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

నగరంలో విద్యుత్ అంతరాయం

ఒంగోలు వన్‌టౌన్: నగరంలో ఆదివారం తీవ్రస్థాయిలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఉదయం నగరం నడిబొడ్డున ఉన్న జేఎంబీ చర్చి ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు అవస్థపడ్డారు. ఉదయం 11.40 నుంచి 12.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనంతరం విద్యుత్ పునరుద్ధరణ జరిగినా.. ఒక ఫేజ్‌పైనే సరఫరా చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి వరకూ మళ్లీ అదే పరిస్థితి నెలకొంది. సింగిల్ ఫేజ్‌పైనే విద్యుత్ సరఫరా జరిగింది. చర్చిలో ప్రార్థనలకు తీవ్రంగా అంతరాయం కలగడంతో జనరేటర్ ఆన్‌చేసి ప్రార్థనలు నిర్వహించారు.

చిన్నపాటి గాలులు, వర్షానికే విద్యుత్ అంతరాయం...

ఆదివారం సాయంత్రం చిన్నపాటి గాలులు, వర్షానికే నగరంలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇక్కట్ల పాలయ్యారు. చీకటిపడిన తర్వాత కూడా విద్యుత్ రాకపోవడంతో నగరం అంధకారంలో ఉండిపోయింది. సుమారు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రెండు గంటల తర్వాత పునరుద్ధరించినా ఒక ఫేజ్‌లో విద్యుత్ సరఫరా కాలేదు. ఈ నెల 11వ తేదీ కూడా రాత్రి 9 నుంచి 11.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వేసవి కారణంగా ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అప్రకటిత విద్యుత్ కోతలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సక్రమంగా విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని ఒంగోలు నగరవాసులు కోరుతున్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన ర్యాలీ

సంతనూతలపాడు: మండలంలోని మంగమూరు, కామేపల్లివారిపాలెం అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో ఆదివారం మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల బరువు, ఎత్తు కొలిచారు. వారు ఏ విధమైన గ్రేడ్లో ఉన్నారో గుర్తించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువ గల పౌష్టికాహారం గురించి వివరించారు. పోషకాహార లోపం, రక్తహీనతను నివారించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్లు ఆర్.పార్వతీభాయి, పి.నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.అంజలి, ఎస్‌కే ఖాదర్ నిషాబేగం, ఎస్.మాధవి, కే విజయమ్మ, కే పూర్ణచంద్రావతి, యూవీ శేషమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా జెండాల పండుగ

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో నాగులమీరాస్వామి ఉరుసు సందర్భంగా ఆదివారం జెండాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. మకాణంలో కొలువైన పీరుకు పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేక అలంకరించారు. సాయంత్రం రైతులు ఎద్దుల బండిపై బిందెలను ఏర్పాటు చేసుకుని గ్రామంలో వీధుల్లో తప్పెట్లు, మేళాలతో ఊరేగింపుగా ఊరి చివరికి బయలుదేరి బిందెలకు మంచి నీటిని నింపుకొని అందులో బెల్లం కలిపి పానకంలా తయారు చేసి భక్తులకు పోసి మొక్కులు తీర్చుకుంటారు. అర్ధరాత్రి సమయంలో మకాణంలో కొలువు తీరిన పీరుకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామంలో ఊరేగిస్తారు. సాయంత్రం యువకులచే కోలాటం ప్రదర్శించారు.

ఘనంగా భరద్వాజ మాస్టార్ ఆరాధనోత్సవాలు



ప్రత్యేక పూజలో సాయి మాస్టర్ భక్తులు



కోలాటం ఆడుతున్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ 36వ ఆరాధన మహోత్సవాలను ఒంగోలు షిరిడీ సాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు లాయర్‌పేట సాయిబాబా మందిరంలో ఉదయం ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టార్ సమాధికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి దీప ధూప హారతులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నలుమూలల నుంచి సాయి మాస్టర్ భక్త జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. షిరిడీ సాయి కల్చరల్ మిషన్ నిర్వాహకులు భరద్వాజ మాస్టర్ విగ్రహ ప్రతిష్ఠ చేసేందుకు నిర్ణయించగా, భక్తులు ఆర్థిక సహాయాన్ని అందించారు.

ముగిసిన హరిహరక్షేత్రం వార్షికోత్సవం



శాంతి కళ్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు



శాంతి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చీమకుర్తి: స్థానిక హరిహరక్షేత్రం 19 వార్షికోత్సవం శనివారం రాత్రి నిర్వహించిన శాంతి కళ్యాణోత్సవంతో ముగిసింది. కళ్యాణోత్సవంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా సుధీర్, శిద్దా పాండురంగారావు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారి కళ్యాణ వేడుకలను ఆలయ ప్రధాన అర్చకులు శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

మత్స్యకార భరోసా ఇచ్చి ఆదుకోవాలి

కొత్తపట్నం: వేట నిషేధ సమయం ప్రకటించినందున మత్స్యకారులకు మత్స్యకార భరోసా ఇవ్వాలని జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు గొల్లపోతు పేరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నేటి నుంచి వేట నిషేధించడం జరిగిందని, రెండు నెలల పాటు మత్స్యకారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఈ విషయాన్ని ప్రభుత్వం గమనించి వారిని ఆదుకోవాలని కోరారు. మండలంలో మత్స్యకార గ్రామాలైన పిన్నింటివారిపాలెం, గుండమాల, రాజుపాలెం, ఈతముక్కల, కొత్తపట్నం, పల్లెపాలెం గ్రామాల్లో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటనే జీవనాధారం చేసుకుని బతుకుతున్నారన్నారు. వీరికి మరో ఆధారం లేదన్నారు. మత్స్యసంపద ఉత్పత్తి కోసం ఏప్రిల్ 14 నుంచి జూన్ 15వ తేదీ వరకు వేట నిషేధించడం జరిగిందన్నారు. అందులో భాగంగా మత్స్యకారులు మర పడవలతో వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ఎవరైన వేటకు వెళితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా రిజిస్ట్రేషన్ లైసెన్సు, సొసైటీ సభ్యత్వం రద్దు చేయడం జరుగుతుందన్నారు. మత్స్యకారులంతా జిల్లా అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరానికి వచ్చిన రోగులు

మద్దిపాడు: మద్దిపాడులో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా కాకుమాను అయ్యన్న మెమోరియల్ ఆధ్వర్యంలో స్థానిక నటరాజ కళాకేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఒంగోలు ఎయిమ్స్ హాస్పిటల్ వైద్య బృందం పాల్గొని వైద్యసేవలు అందించింది. 418 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు కూడా పంపిణీ చేశారు. ఎయిమ్స్ హాస్పిటల్ డాక్టర్లు నీరజ, రామలింగేశ్వరరావు, బీవీ రమణరెడ్డి, కార్తీక్, హర్షకుమార్, రోహిత్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొని వైద్య సేవలు అందించారు. అయ్యన్న కుమారులు కాకుమాను శశికిరణ్, అచ్యుత్ కుమార్, శ్రీవర్మ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, కాకుమాను శ్రీనివాసరావు, ఏలూరు లక్ష్మీనారాయణ, సుధాకర్, కృపానందం, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

ఒంగోలు మెట్రో: ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు పొట్టి వీరరాఘవరావు అధ్యక్షతన నగరంలోని ఉమామనోవికాస కేంద్రంలో 70 మంది మానసిక ఎదుగుదల లేని విద్యార్థులకు ఆదివారం క్రీడా దుస్తులు అందజేశారు. ఉదయం అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. ఉమామనోవికాస కేంద్రానికి ఒక నెలకు సరిపడా బియ్యం, పప్పు, నూనె, తదితర నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పి.విజయకృష్ణ, శిఖాకొల్లి ఫణిరాజ్, తాళ్లూరి శ్రీను, టి.పాండురంగారావు, బైసాని శ్రీనివాసరావు, బీవీకే రమేష్, కే చంద్రమౌళి, నూకల వేంకటేశ్వరగుప్తా, తుమ్మపూడి సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఉమామనోవికాస కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

అర్చకుల మధ్య వివాదం

- పట్టించుకోని ఆలయ అధికారులు

తాళ్లూరు: భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాల్సిన అర్చకుల మధ్య వివాదం చోటు చేసుకున్న సంఘటన జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గుంటి గంగమ్మ దేవస్థానం సన్నిధిలో ఆదివారం చోటుచేసుకుంది. భక్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటి గంగమ్మ దేవస్థాన అర్చకులు రొటేషన్ పద్ధతిలో వారి డ్యూటీలు చేస్తుంటారు. కానీ, గంగమ్మ జాతర సందర్భంగా డ్యూటీ విషయంలో ఆలయ అధికారులు అర్చకుల రొటేషన్ పద్ధతిని మార్చు చేశారు. ఒక అర్చకుడికే జాతర జరిగే మూడు రోజులు అవకాశం ఇవ్వాలంటూ ఆలయంతో సంబంధం లేని బయట వ్యక్తి అర్చకుడితో గొడవ పడటం చర్చనీయాంశంగా మారింది.

ఈ విషయంలో ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సమస్యను పరిష్కరించడంలో విఫలమైనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. గంగమ్మ జాతర సమయంలో ఇలాంటి వివాదాలు ఏంటని ఆలయానికి వచ్చిన భక్తులు వాపోతున్నారు.